

విస్తరణతో విశాలమైన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు

మహా విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. పరిపాలనా రాజధానికి తగినట్టు అన్ని విధాల నగరాన్ని ఆధునికీకరిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తొలగేలా విస్తరణ చేపట్టారు. గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం చూపడంతో ట్రాఫిక్ సమస్యలు నానాటికీ ఎక్కువ కావడంతో ఏళ్ల తరబడి జనం ఇబ్బందులకు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితి మారింది. స్మార్ట్ సిటీకి తగినట్టు ప్రధాన కూడళ్లు, రహదారులను శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు.



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో విస్తరణ అనంతరం నిర్మిస్తున్న డ్రెయిన్లు

మార్గం.. సువిశాలం



- రూ.11 కోట్లతో అక్కయ్యపాలెం ప్రధాన రహదారి విస్తరణ
- తీరనున్న ట్రాఫిక్ సమస్యలు
- సుందరంగా మహారాణి పార్లర్ కూడలి
- స్థానికులు, వాహన చోదకుల హర్షం

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ ఖర్చు రూ.11 కోట్లు	మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్ ఖర్చు రూ.96 లక్షలు	మహారాణి పార్లర్ నుంచి హైవే వరకు విస్తరణ రూ.1.20 కోట్లు
మహారాణి పార్లర్ నుంచి దొండపర్తి కూడలి వరకు రోడ్డు విస్తరణ రూ.1.64 కోట్లు	సెంటర్ మీడియన్ లైటింగ్ కోసం రూ.1.58 కోట్లు	
హైవే నుంచి దొండపర్తి కూడలి వరకు ఇరువైపులా సీసీ డ్రెయిన్ల నిర్మాణ ఖర్చు రూ.5.26 కోట్లు	దొండపర్తి కూడలి నుంచి ఫ్లైఓవర్ వరకు రోడ్లు, డ్రెయిన్ల పనులు రూ.1.35 కోట్లు	

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ, మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి నగరంలోకి వాహనాలు ప్రవేశించే ప్రధాన రహదారైన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ఇరుగ్గా ఉండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మాస్టర్ ప్లాన్‌లో ఈ రహదారి వందడుగుల మార్గంగా ఉన్నప్పటికీ, విస్తరణ విషయంలో గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపించింది. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రధాన రహదారుల విస్తరణకు నడుం బిగించింది. ఈ క్రమంలో రూ.96 లక్షలతో మహారాణి పార్లర్ కూడలి ఆధునికీకరణ, రూ.11 కోట్లతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ చేపడుతున్నారు.

జోరుగా పనులు..

జాతీయ రహదారి నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగుల రోడ్‌గా, అక్కడి నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రహదారిగా విస్తరిస్తున్నారు, గత రెండు నెలలుగా ఈ పనులు జోరుగా జరుగుతున్నాయి. ముందుగా రహదారిలో అక్రమణలు తొలగించారు. ఇరువైపులా సీసీ డ్రెయిన్లు నిర్మించి వాటిపై సిమెంట్ శ్లాబులు వేస్తున్నారు. మహారాణి పార్లర్ కూడలిలో వాటర్ ఫౌంటైన్ నిర్మించారు. జంక్షన్‌కు నాలుగు వైపులా రహదారుల్లో కోబుల్ స్టోన్ టేబుల్ టాప్స్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్, సెంటర్ ఐలాండ్ నిర్మించారు. ఫౌంటైన్‌కు విద్యుత్ దీపాలు అమర్చారు. అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ఈ మార్గంలో ట్రాఫిక్ వెతలు తీరినట్టేనని వాహన చోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మహారాణి పార్లర్ కూడలిలో నిర్మించిన టేబుల్ టాప్



డ్రెయిన్లపై శ్లాబ్ వేస్తున్న కార్మికుడు

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి



అక్కయ్యపాలెం ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. ఇరుకు రహదారితో దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం. మా సమస్యలు తీరేలా జగనన్న ప్రభుత్వం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌ను విస్తరిస్తోంది. మహారాణి పార్లర్ కూడలిని అందంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో హైవే నుంచి దొండపర్తి కూడలి వరకు ప్రయాణం సాఫీగా చేయవచ్చు.

– దుర్గారావు, అక్కయ్యపాలెం

వాహనాల రాకపోకలకు వీలుగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. అక్కయ్యపాలెం రహదారి విస్తరణతో ఈ ప్రాంత వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. వాహనాల రాకపోకలకు వీలుగా ప్రధాన రహదారులను విస్తరించడం అభినందనీయం.

– కె.శ్రీనివాసరెడ్డి, లలితానగర్

క్లుప్తంగా

ధనుర్మాస పూజలు ప్రారంభం



లలితా పీఠంలో గోదాదేవికి అభిషేకం

సీతంపేట: గోదాదేవి తన గోపికా చెలికత్తెలతో కాత్యాయని వ్రతం చేసి 30 రోజుల పాటు ఆచరించిన వ్రతమే ధనుర్మాస వ్రతం. నెలగంట పెట్టడంతో ఆలయాల్లో ధనుర్మాస పూజలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. జనవరి 14 భోగి రోజున గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం ముగుస్తుంది. అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠం, శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం పూజలు మొదలయ్యాయి. లలితా పీఠంలో గోదాదేవికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. పీఠంలో కొలువైన వెంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. నిత్య కైంకర్యంలో భాగంగా వెంకటేశ్వర స్వామికి , అమ్మవార్లకు అర్చన, మంత్రపుష్పం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమవుతాయని కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారు జామున 4 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం అర్చన, తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరపున శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం వినిపిస్తారు. ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ప్రతి రోజూ 4.30 గంటలకు ప్రాతఃకాల అర్చన, తిరుప్పావై పఠనం జరుగుతాయి. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది. ఆరోజు వైభవుడు సర్వాంగ వజ్రకవచం ధారిగా దర్శనం ఇస్తారు. జనవరి 14న సాయంత్రం శ్రీగోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తామని ఈవో చెప్పారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఇంటింటికీ కార్పొరేటర్



ఇంటి వద్ద ఓటర్ల వివరాలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు 160 సచివాలయం పరిధిలోని నక్కవానిపాలెం రామాలయం వీధిలో శనివారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఇంటింటా పర్యటించారు. ఓటరు జాబితా ప్రకారం ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు, ఎన్ని ఓట్లు ఉన్నాయి, ఇళ్లు మారిన వారు ఉన్నారా లేక వేరే చోటకు వెళ్లిపోయారా అని పరిశీలించారు. కార్పొరేటర్ వెంట బీఎల్‌వో సీతాకుమారి ఉన్నారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు



న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లోని విక్టరీ హోలీ స్పిరిట్ ప్రేయర్ చర్చ్‌లో శనివారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రార్థనలు చేశారు. అందరూ ఆనందంగా క్రిస్మస్ పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ జోసెఫ్ నాయుడు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొండవాలు సమస్యల పరిష్కారానికి కృషి

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- సింగరాయిమెట్టలో 'గుడ్ మార్నింగ్ నార్త్'



సింగరాయిమెట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు ప్రసాద్, శంకరరావు

మురళీనగర్/మద్రిపాలెం: పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేసేందుకు, కొండవాలు ప్రాంతాల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు గుడ్ మార్నింగ్ నార్త్ పేరిట ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించినట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆ వార్డుల పరిధి సింగరాయిమెట్ట కొండవాలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని పెండింగ్ పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 50వ వార్డులో మెట్ల మార్గం వేసేందుకు చదును చేసిన ప్రాంతాన్ని కె.కె.రాజు పరిశీలించారు. ఆయా వార్డుల్లో రక్షణ గోడలు, కాలువలు, వీధిలైట్లు, కుళాయిలను పరిశీలించి, వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బంది కలగకూడదని అధికారులకు సూచించారు. పర్యటనలో డీఈ భరణి, ఏఈలు, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, బగాది విజయ్‌కుమార్, శ్రీనివాసరాజు, ఢిల్లీరావు, చంద్రశేఖర్, వేణు, సబ్బవరపు శ్రీను, ఆదిరెడ్డి శ్రీను, శివరాం, సీహెచ్ శ్రీను, త్రినాథ్, ఏవీఎస్ రాజు, రాజేశ్వరి, దిలీప్, బుజ్జి, రాంబాబు, శంకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు ఏఎస్సార్ నగర్ కొండవాలు ప్రాంతంలోని 108 అడుగుల శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీహనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణ రాజు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, మహన్యాస పూర్వక మన్యుసూక్త పంచామృతాభిషేకం, దశ సహస్ర నాగవల్లిదళ అర్చన, సింధూర పూజ, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు, మధ్యాహ్నం ప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు.

'మట్టి వాసన, ధ్వజస్తంభాలు' పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అడపా రామకృష్ణ, సాహితీవేత్తలు

సీతంపేట: సామాజిక స్పృహ, నైతిక విలువలు గల వ్యక్తిత్వం ఒక్క సాహిత్యకారులకే కాకుండా అందరికీ ఉండాలని విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ అన్నారు. అదే స్ఫూర్తితో రచనలు చేస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. రచయిత గన్నవరపు నరసింహమూర్తి రచించిన మట్టి వాసన కథల సంపుటి, ధ్వజస్తంభాలు వ్యాస సంపుటి పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. సభాధ్యక్షుడు శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ రచయిత సాహిత్య కృషి ఒక గ్రంథాలయంతో సమానమన్నారు. మట్టి వాసన కథల సంపుటిని డాక్టర్ కొచ్చర్లకోట సత్యనారాయణ సమీక్షిస్తూ మనుష్యుల జీవన వేదాన్ని కథలు ప్రతిబింబిస్తున్నాయన్నారు. ధ్వజస్తంభాలను వేముల భాస్కరాచారి సమీక్షిస్తూ లబ్ధ ప్రతిష్ఠులైన సాహిత్యవేత్తలను, కళాస్రష్టలను మనకు గుర్తుచేశారన్నారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, సర్వేశ్వరశాస్త్రి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

సీఎం జగన్‌కు యువకుడి కృతజ్ఞతలు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో నివసిస్తున్న ఓ యువకుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కు అందుకున్నాడు. భావన చరణ్‌తేజ అనే యువకుడు కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని వారి బంధువులు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు వద్ద ప్రస్తావించిన మేరకు ఆయన సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. దీంతో ఆ యువకుడికి రూ.2.30 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధి చెక్కును శనివారం భావన చరణ్‌తేజకు అల్లు శంకరరావు అందించారు. తనకు ఆర్థిక సాయాన్ని అందించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కె.కె.రాజు, అల్లు శంకరరావులకు చరణ్‌తేజ కృతజ్ఞతలు తెలిపాడు.



చరణ్‌తేజకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న అల్లు శంకరరావు

ఇంటి నుంచే విద్యుత్ పొదుపు

పర్యవేక్షక ఇంజినీర్ మహేంద్రనాథ్ పిలుపు



మాట్లాడుతున్న పర్యవేక్షక ఇంజినీర్ మహేంద్రనాథ్

తాటిచెట్లపాలెం: ఇంధన సంరక్షణ, విద్యుత్ పొదుపు పద్ధతుల గురించి వినియోగదారులకు, ప్రజలకు వివరించాలని స్వయం సహాయక మహిళా సంఘాలకు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రీన్‌పార్క్ హోటల్ ప్రాంతంలోని ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో స్వయం సహాయక మహిళా సంఘాలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. మహిళలతో ఎక్కువగా మమేకమై ఉండే స్వయం సహాయక బృందాలు విద్యుత్ పొదుపుపై వారికి అవగాహన కల్పించాలన్నారు. అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆర్పివేయడం, సూర్యకాంతి అందుబాటులో ఉన్నప్పుడు కిటికీల తలుపులు తెరవడం, ఏసీలు వాడుతున్నప్పుడు 24 డిగ్రీల కంటే ఎక్కువగా ఉండేలా చూడటం చేస్తే విద్యుత్‌ను ఆదా చేయవచ్చన్నారు. స్టార్ రేటింగ్ గల గృహోపకరణాలను వినియోగించడం ద్వారా కూడా ఏటా కొన్ని వేల రూపాయలు ఆదా చేసుకోవచ్చని చెప్పారు. ఇలా చేయడం ద్వారా భావితరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చని, విద్యుత్ పొదుపు అందరి బాధ్యతని మహేంద్రనాథ్ పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు మాట్లాడుతు ఒక యూనిట్ విద్యుత్ పొదుపు చేస్తే రెండు యూనిట్లను ఉత్పత్తి చేసినట్లేనన్నారు. బొగ్గు, గ్యాస్, క్రూడ్ ఆయిల్ వంటి శిలాజ ఇంధనాలు ఇప్పటికే తరిగిపోతున్నాయని, వీటిని బాధ్యతాయుతంగా వాడటం వల్ల రేపటి తరాలకు కూడా ఆదర్శప్రాయంగా నిలుస్తామన్నారు. విద్యుత్ పొదుపును తమ కుటుంబాల్లో తప్పనిసరిగా పాటిస్తామని, ఇతరులకు తెలియజేస్తామని మహిళలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జోన్–1, డివిజనల్ ఈఈలు, సహాయక ఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు



మాట్లాడుతున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శంకరరావు

మురళీనగర్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఈవో బండారు ప్రసాద్ అధ్యక్షతన ఉత్తర ద్వార దర్శనాల ఏర్పాట్లపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాది మంది భక్తులు తరలి వస్తున్నందున ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ వీవీఐపీ, వీఐపీలు, ప్రోటోకాల్ దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు సామాన్య భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం నడుచుకోవాలన్నారు. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ జనం రద్దీ దృష్ట్యా దర్శనాలు త్వరగా పూర్తయ్యేందుకు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నిర్వహణ, ఇతర లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ అర్చకుడు శేషు స్వామి పూజా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ జయ, సీఐలు, ఎస్‌ఐలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం, 60 అడుగుల రోడ్డు(124 సచివాలయం పరిధి)లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అభివృద్ధి పనులకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల పనులు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, పార్టీ వార్డు నాయకులు గుడ్ల భాస్కరరెడ్డి, అశోక్‌రెడ్డి, నక్క ప్రకాష్, నక్క రాజశేఖర్, నక్క నాగమణి, చలపతి, రంగారెడ్డి, బోర రామిరెడ్డి, సీతాకుమారి, శాంతి, గుడ్ల రఘురామిరెడ్డి, బొచ్చు కృష్ణారెడ్డి, మధు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు, వలంటీర్లు పాల్గొన్నారు.

14 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం



పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు, గంజాయి

సీతమ్మధార: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి రైల్వే స్టేషన్ దరి పోస్టాఫీస్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో అటువైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ తన సిబ్బందితో వారిని విచారించారు. గంజాయి ఉన్నట్లు గుర్తించి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి 14 కిలో గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, కీప్యాడ్ 1 స్వాధీనం చేసుకున్నారు. చెన్నై కాశీపురానికి చెందిన ప్రశాంత్ అనే ఆటో డ్రైవర్, తమిళనాడు, మిల్క్ కాలనీ మాధవవరానికి చెందిన వెల్డర్‌గా పనిచేస్తున్న భాషిర్ అనే వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మద్రిపాలెం వాసి దుర్మరణం

ఎంవీపీ కాలనీ: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఎంవీపీ కాలనీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. మద్రిపాలేనికి చెందిన బైరెడ్డి లక్ష్మీకాంతం(65), బైరెడ్డి రాములు(70) దంపతులు ఎండాడలోని ఓ ఫంక్షన్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఇసుకతోట వద్దకు చేరుకునే సరికి వేగంగా వెనక నుంచి వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. భార్యాభర్తలిద్దరూ రోడ్డుపై పడిపోగా లారీ ముందు చక్రం లక్ష్మీకాంతంపైకి ఎక్కేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు లారీ డ్రైవర్ జగ్గయ్యను అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మీకాంతం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా మితిమీరిన వేగంతో లారీని నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని సీఐ ప్రసాద్ తెలిపారు.

సేవా కార్యక్రమాలపై ప్రత్యేక ప్రణాళిక

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం సూచించారు. వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు సమన్వయంగా పనిచేసి క్లబ్‌కు మరింత పేరు తేవాలన్నారు. చంద్రమౌళి మాట్లాడుతూ ఈ నెల 31న ఉచిత వైద్య శిబిరం, జనవరి 3న నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షిక సమ్మేళనానికి వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి కూర్మారావు, జాలీ వాకర్ ప్రకాశరావు, పూర్వాధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, సీహెచ్ కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనాథం

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

విశాఖ విద్య: పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు 'పాఠశాలల్లో విద్యార్థులకు చేపట్టాల్సిన భద్రతా ప్రమాణాలు–సైబర్ సెక్యూరిటీ అంశాలు' పై జిల్లా స్థాయి వర్క్ షాప్ శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. గాజువాక మండల విద్యాశాఖాధికారి సునీత అధ్యక్షతన జరిగిన సదస్సులో గొండు సీతారాం మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ఉపాధ్యాయులు, స్కూల్ యాజమాన్యాలు కీలక పాత్ర పోషించాలని అన్నారు.